మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

జిల్లాలో 419 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

మిరుదొడ్డి/తొగుట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మిరుదొడ్డి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ, తొగుట మండలం బండారుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మిరుదొడ్డిలో రైతులు పొద్దుతిరుగుడు కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి అనుమతి రాగానే వెంటనే కొనుగోలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 419 ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. అన్ని కేంద్రాలలో మౌలిక వసతులు, టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్ కవర్లు, సుతిల్ దారాలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. తేమ శాతం వచ్చే వరకు రైతులు పొలాల వద్దనే ఆరబెట్టుకోవాలన్నారు. తాలుతీసిన వరి ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తాలు తీసాకే ధాన్యానికి గ్రేడ్ ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడిచిపోతున్నా కొనుగోలు చేసే నాథుడు లేడని మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిలో ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రానికి తీసువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అకాల వర్షం వచ్చే అవకాశం ఉండడంతో ధాన్యం తడిసిపోయే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

రోడ్డుపై బైటాయించి ఆందోళన చేస్తున్న రైతులు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
జిల్లా కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాలలో మే 3న నిర్వహించే నీట్-2026 ఆఫ్‌లైన్ పరీక్షకు తగు ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మే 3న నిర్వహించే పరీక్ష ఏర్పాట్లపై అమె అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలలో 937 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) మార్గదర్శకాల ప్రకారం సెంటర్‌లను ఎంపికచేసి ఈ సెంటర్‌లో సీసీ కెమెరా, పవర్ సప్లై, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్, టాయిలెట్స్ ఇతరత్రా అన్ని సౌకర్యాలు ముందస్తుగా చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. మే 2,3వ తేదీలలో రెండు సెంటర్లలో ఎలాంటి విద్యుత్ కోరత లేకుండా చూసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని, విద్యార్థులు సకాలంలో సెంటర్లకు చేరుకునేలా అదనపు బస్సులు నడపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష రాసే 937 మంది విద్యార్థులు అలాట్మెంట్ కార్డు, ఒరిజినల్ రెండు పాస్ ఫోటోస్, ఒరిజనల్ గుర్తింపు కార్డు మాత్రమే తీసుకరావాలని మిగతా ఎలాంటి వస్తువులు తీసుకురావద్దన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, డిఆర్వో నాగరాజమ్మ, ఎవో రాజ్‌కుమార్, కెవి ప్రిన్సిపల్ సూర్యప్రకాష్, నవోదయ స్కూల్ ప్రిన్సిపల్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం బతుకు ఆగం...

అదనపు కలెక్టర్ నగేష్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మెదక్ ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణం రాందాస్ చౌరస్తాలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో 'బాల్యవివాహం బతుకు ఆగం' అనే నినాదంతో రాందాస్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మెదక్ అదనపు కలెక్టర్ నాగేష్, మున్సిపల్ చైర్మన్ రాధికభూపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాల్యవివాహాన్ని ఆపి ఆరోగ్యకరమైన, విద్యావంతమైన సురక్షిత సమాజాన్ని నిర్మించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు.. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అనేక చట్టాలు హక్కులు తీసుకువచ్చిందని వాటిని సద్వినిగం చేసుకోవాలని కోరారు అనంతరం బాల్యవివాహాలను రద్దుచేయాలని ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కల్పించాలని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఎఫ్ఓ జోజి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఈఓ విజయ, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ఇతర శాఖల జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు వార్డు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగ్‌లో పర్యటించిన ఎంపి

రైల్వే బ్రిడ్జి కోసం స్థల పరిశీలన..

నార్సింగి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల కేంద్రంలో మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పర్యటించారు. అనంతరం నార్సింగి మండలం, చిన్నశంకరంపేట మండల గ్రామాల సర్పంచులు, ప్రజలు రైల్వే బ్రిడ్జి, నూతన రహదారి మంజూరుకు ఎంపిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పుడున్న అవసరాల నిమిత్తం బ్రిడ్జి, రహదారి రాకపోకలు నిలిచిపోవడం జరిగింది. బ్రిడ్జిని, రహదారిని పునరుద్ధరించి పెద్ద బ్రిడ్జిని మంజూరు చేయించాలని కోరారు. అనంతరం నూతన రహదారి, రైల్వే బ్రిడ్జి స్థానిక సర్పంచులు ప్రజలతో పాటు స్థల పరిశీలన చేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు కోసం సౌత్ సెంట్రల్ రైల్వే డిఆర్ఎంతో మాట్లాడి నూటికి నూరు శాతం శాలిపేటకు వెళ్లి రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. దీనిలో భాగంగా జాప్తి శివనూర్ సర్పంచ్ నర్సింలు, ఉపసర్పంచ్ రాములు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి 44 జాతీయ రహదారిపై లైట్లు వెలగడం లేదని ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పగా స్పందించిన ఎంపీ వెంటనే జిఎంఆర్ పిడి నాగేశ్వర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నారాయణఖేడ్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త
వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణచేయాలని సూచించారు. మంగళవారం నారాయణ ఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖల అధి కారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, శానిటేషన్, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై వివరంగా చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వేసవిలో సమస్యలు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు వృథాకాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధి స్పష్టంగా తెలిసేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని, బిల్లులు ఆలస్యం లేకుండా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. సాదాబైనామాలు, భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. విద్యుత్‌శాఖకు సంబంధించి లోవోల్టేజ్, ట్రాన్స్ ఫార్మర్లు, లైన్ల మరమ్మతులు వంటి సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు సమన్వ యంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, విద్యుత్, హౌసింగ్, మిషన్‌భగీరథ అధికారులు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళ్లేవారు నగదు, నగలను లాకర్లలో భద్రపరుచుకోవాలి : సిద్దిపేట సిపి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లకు తాళాలువేసి స్వగ్రామాలకు లేదా విహారయాత్రలకు వెళ్తున్న క్రమంలో ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సాధన రష్మీపెరుమాళ్ సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో చాలా మంది కుటుంబాలతో కలిసి బయటకు వెళ్తుండగా ఈ పరిస్థితిని అసరాగా చేసు కొని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు నగదు, బంగారు అభరణాలు, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఇంటి చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకొని వాటిని మొబైల్ ఫోన్లకు అను సంధానం చేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంచవచ్చని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినప్పుడు వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వేసవికాలంలో పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలు సరదాకోసం చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లి ఈత కొట్టే ప్రమాదకర అలవాటు ఉన్నందున తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలను ఒంటరి గా నీటి వనరుల వద్దకు పంపొద్దని ఎల్లప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలని తెలి పారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటుందని అయినప్పటికీ ప్రజలు సైతం బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

మహిళా వ్యతిరేకి కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతాం

బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: మహిళా రిజర్వేషన్ బిల్లును మోదీ ప్రభుత్వం తీసుకోవస్తే కాంగ్రెస్ అడ్డుకొని మహిళా ద్రోహిగా మరిందని బీజేపీ సంగారెడ్డిజిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో మహిళా ఆగ్రహ యాత్ర, కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, బీజేపీ నాయకురాలు ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ, మహిళలు, దళితులు, గిరిజనులు చట్టసభల్లో అడుగు పెట్టకుండా కాంగ్రెస్ దశాబ్దాలుగా అడ్డు పడుతోందన్నారు. మహిళలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతో వారసత్వ పార్టీలన్నీ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నారని తెలిపారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం లభిస్తుందన్న మహిళల ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లింది. ఇచ్చిన హామీలు నెరవేర్చక తెలంగాణ మహిళల్ని మోసం చేసిన రేవంత్ రెడ్డి, మహిళా బిల్లును అడ్డుకొని పైశాచిక ఆనందం పొందిన విషయాన్ని మహిళా లోకం గమనిస్తోందనీ అన్నారు. అన్నివిధాల మహిళలను వంచిస్తున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు మహిళామణులు తగిన బుద్ధి చెప్పే రోజు ఎంతో దూరం లేవని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయలక్ష్మి, నాయకురాలు భవాని, రాణి ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నేతలు

జనార్ధన్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం పోరాడుతుంటే అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్న రేవంత్ ప్రభుత్వ తీరును ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి చేపట్టిన పాదయాత్రను అడ్డుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. మంగళవారం ఉదయం పాదయాత్రకు బయలుదేరకుండా అక్కన్నపేట పోలీసులు గోవర్ధనగిరిలోని ఇంటి వద్దే జనార్ధన్‌ను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దౌర్జన్య చర్య అని విమర్శించారు. జిల్లాలో పలుచోట్ల ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం భయపడుతుందన్నారు. వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, ఉన్నత విద్యకు దూరమవుతూ భవిష్యత్తు కోల్పోతున్నారని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సి న ప్రభుత్వం, పోలీసులను ముందుకు నెట్టి అరెస్టుల రాజకీయం చేయడం సిగ్గుచేటని, అరెస్టులు, లాఠీ దెబ్బలు తమను భయపెట్టవని, ఉద్యమాలను అణచివేయాలనే ప్రయత్నాలు మరింత పోరాటానికి దారి తీస్తాయని హెచ్చరించారు. పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే విద్యార్థి ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా ఉగ్రరూపం దాల్చుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, విద్యార్థుల ఆగ్రహం చెలరేగితే ప్రభుత్వం ఎదుర్కోలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజాపాలన పేరుతో అధికారం లోకి వచ్చిన ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా సాగితే తీవ్ర ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన చిన్నశంకరంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన యోగి, విఠల్, అనిల్‌లు ద్విచక్రవాహనంపై మెదక్ నుండి చిన్నశంకరంపేటకు వస్తుండగా శివారులో ఉన్న శ్రీనివాస గార్డెన్ కళ్యాణమండపం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులకు అంబులెన్స్ ఈఎంటీ మంజుల ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉన్నత స్థానానికి ఎదగాలంటే చదువు ముఖ్యం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా పిల్లల భద్రత, నో డగ్స్ ప్రచారంపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల కార్యాచరణ ప్రక్రియావారం మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడం, సైబర్ నేరాల, కిషోర బాలికల గర్భధారణ సమస్యలపైన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కిశోర వయస్సు అనేది మంచి చెడు తెలియని వయసని, ఈ వయస్సులో చదువుకోవడం అనేది విధిగా భావించాలన్నారు. జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే చదువు ఒక నమ్మకాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వం అనేక విద్యా సంస్థల ద్వారా మంచి విద్యను అందిస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేవుడు ఇచ్చిన ఈ జీవితంలో 10 మందికి ఆదర్శంగా నిలిచేలా మన ఎదుగుదల ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓడిపోవడం అనేది విజయానికి గట్టి పునాది వంటిదనీ...ఒక దారి మూసుకుపోయింది అంటే 10 దారులు తెరుకుంటాయని తెలిపారు. చిన్న చిన్న సమస్యలకు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని ప్రేమలు, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టిసారించాలని...చదువు ఒక్కటే ఉన్నత స్థాయిలో నిలుపుతుందన్నారు. సమాజంలో గుడ్, బ్యాడ్ టచ్‌లు డ్రగ్స్ బారిన చెడు వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చెసుకొవద్దన్నారు. ఎల్లప్పుడూ పాజిటివ్ ఎనర్జీ రావాలంటే యోగ, ద్యానం లాంటివి మంచి ప్రవర్తన, అలవాట్లతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య, సీడీపీఓ రాము, ఎంఈవో, తహశీల్దార్, ఎంపిడివో, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, ఆధ్యాపకులు, స్నేహ సంఘాల ప్రతినిధులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

మంటలు ఆర్పుతున్న డిఫెన్స్ ఫైర్ సిబ్బంది

బ్యాటరీ పేలుడుతో కార్లు, బైక్ దగ్ధం

గుమ్మడిదల ఏప్రిల్ 28 ప్రభాతవార్త : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు సోనీ మోటర్ మెకానిక్ షెడ్‌లో ఉన్న కారు బ్యాటరీ పేలడంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. పేలుడు అనంతరం మంటలు వేగంగా వ్యాపించి షెడ్‌లో ఉన్న వాహనాలను ఆవరించాయి. ఈ ఘటనలో రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్‌తో పాటు షెడ్‌లోని పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే ఎయిర్ ఫోర్స్ డిఫెన్స్‌కు చెందిన ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. వారు సకాలంలో స్పందనతో మరింత నష్టం తప్పింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పలువురికి గాయాలు.. కేసు నమోదు

కొల్చారం, ఏప్రిల్ 28 (ప్రభాత వార్త): కొల్చారం గ్రామ శివారులోని జైమందిర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి వస్తున్న బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సును డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి, ముందు వెళ్తున్న వడ్ల లోడుతో ఉన్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పన్యాల మల్లారెడ్డి, కూతురు రమ్యశ్రీతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎండి జాకీర్, శక్తివేల్, ఎరుకల లక్ష్మి, అమ్రిన్, ఎండి రఫీక్ తదితరులు గాయపడ్డారు. మరికొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కొల్చారం ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో తొమ్మిది మందికి గాయాలు

నార్సింగి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల కేంద్రంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. పట్టణంలో రెండు రోజుల్లో ఇంటి వద్ద ఉన్న 9 మందిపై దాడిచేసి గాయపరిచింది. కాగా కుక్క దాడిలో తీవ్రంగా గాయాలు కావడంతో వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు గాయపడినవారిని పరామర్శించారు. పిచ్చికుక్క కనిపించిన వారిపై దాడి చేస్తుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవ్వుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పిచ్చికుక్కలను కట్టడిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మద్యంమత్తులో ఉరేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కాగితాల జహంగీర్(39) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా అతడు మద్యానికి బానిసై చిన్నపాటి అప్పులు చేశాడు. అవి పెరిగిపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం తాగి ఓ దావత్‌లో భోజనం చేసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి బయటే నిద్రించాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా అటుగా వెళ్లిన స్థానికులకు కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే వారు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి తల్లి షాబెరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ... ఒకరు మృతి

నలుగురికి తీవ్ర గాయాలు...

వెల్దుర్తి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : రైతులు ఆరు కాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని రోడ్లపై ఎండబెట్టడంతో ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వెల్దుర్తి మండలంలోని ఆరెగూడెం డంపింగ్ యార్డ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తి నుంచి ధర్మారం గ్రామానికి బైక్‌పై వెళుతున్న మరికంటి శంకర్(35), మరికంటి శ్రీనివాస్ అందుగులపల్లి నుంచి బైక్‌పై వస్తున్న అక్కమల్ల దినేష్, నీరుడి పద్మ, నీరుడి రాజమణి ఆరెగూడెం డంప్ యార్డ్ వద్ద రోడ్డుపై ధాన్యం ఎండబెట్టడంతో ఒకవైపు నుండి ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ధర్మారం గ్రామం చెందిన మరికంటి శంకర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న అనుగులపల్లి గ్రామానికి చెందిన దినేష్‌కు గాయాలు కావడంతో ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన శంకర్‌కు భార్య స్వప్న, కొడుకు హర్షవర్ధన్, కూతురు హరిత ఉన్నారు. కాగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బాధితులను ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడి.. ఇసుక అక్రమ నిల్వలు పట్టివేత

బెజ్జంకి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలోని పలువురు ఇసుక అక్రమ రవాణదారులు ఇసుక అక్రమ నిల్వాలు ర్పాటు చేసి మళ్లీ ఇసుక దందాకు తెరలేపారు. మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడితో మండల పరిధిలోని దాచారం శివారులో అక్రమంగా నిల్వ చేసిన భారీ ఇసుక నిల్వలు వెలుగులోకి వచ్చాయి. నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాచారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసి ఇసుకను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. పై అధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇసుక డంప్‌లను సీజ్ చేసిన పోలీసులు

రిమాండ్ ఖైదీకి హరీశ్‌రావు పరామర్శ

-తప్పు చేస్తున్న ఏ పిఎస్‌ను వదిలిపెట్టం

కంది, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
ఫేక్‌పోస్టులు పెట్టినవారిని వదిలేసి ఆధారాలతో ఫిర్యాదుచేసిన బిఆర్‌ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ క్రిశాంక్‌ను అరెస్టుచేయడం కాంగ్రెస్ కక్ష సాధింపుకు నిదర్శమని మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. మంగళవారం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న క్రిశాంక్‌తోపాటు మరో ఏడుగురు పార్టీ కార్యకర్తలను సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కొనింటి మాణిక్ రావులతో కలిసి హరీష్‌రావు పరామర్శించారు. ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు, అణిచివేసే కుట్రలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. కొందరు ఐపిఎస్ అధికారులు బెంగుళూరు ప్రైవేట్ హ్యాకర్లను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చోబెట్టి మా ఫోన్లు, ఇళ్ల ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని, చట్టవిరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న అధికారులను పదవీ విరమణ పొందాక సైతం వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంద కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. సన్నబియ్యానికి బోనస్ ఇస్తారో, లేదో సిఎం తేల్చాలని సూచించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి 6 గ్యారంటీలతో పాటు ఏడోగ్యారంటీగా ప్రజాస్వామ్యం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు నియంతలా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ ఫోన్ల కుంభకోణం, టెన్త్ పేపర్ లీక్, హెచ్‌సియు గచ్చిబౌలిభూములు, సోమ్ డిస్టలరీస్‌న వ్యవహారం, మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ ఇంగ్లాండ్ వివాదంలాంటి తప్పులను ఎత్తిచూపినందుకే క్రిశాంక్‌పై ప్రభుత్వం అక్రమంగా వరుసకేసులు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. లగచర్లలో గిరిజనులపైన, మెదక్, సంగారెడ్డిలో మా నాయకుల పైన అక్రమకేసులు బనాయించారన్నారు. జూబ్లీ హిల్స్ ప్యాలెస్‌లో కూర్చుని నేనేరాజు, నేనేమంత్రి అనుకుంటున్న రేవంత్‌రెడ్డి అరాచకాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, తగురీతిలో బుద్ధిచెప్పడం తథ్యమన్నారు. కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో జరిగే అవినీతి, అక్రమాల వ్యవహారాలన్నీ రికార్డు అవుతున్నా యని, రేవంత్‌రెడ్డికి మాటలు ఎక్కువ చేతలు తక్కువని వ్యంగ్యంగా ప్రస్తావించారు. శనగలు, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు 20 రోజులుగా పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనే దిక్కేలేకుండా పోయిందని విస్మయం వ్యక్తంచేశారు. ఎకరాలకు 26 క్వింటాళ్లే మక్కలు కొంటామని కొత్త షరతులుపెట్టి అన్నదాతలను ఆగంచేస్తున్నారని ప్రభుత్వతీరుపై అసహనం వ్యక్తంచేశారు. 13లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తే సగంకూడా కొనలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. క్రిశాంక్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని, పిటి వారెంట్లు వేసి ఇబ్బంది పెట్టాలని చూస్తే మాత్రం చూస్తూ ఊరు కోం అని హెచ్చరించారు.

మహిళ అభివృద్ధిపై మానవహారం

మహిళాభివృద్ధిపై మానవహారం నిర్మించిన అధికారులు తదితరులు

వెల్దుర్తి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తిలో మంగళవారం నాడు మహిళా అభివృద్ధి. శిశు సంక్షేమ శాఖ. ఐసిడిఎస్. ఆరోగ్యశాఖ. ఆధ్వర్యంలో కిషోర్ బాలికలతో వరి మనవహారం నిర్వహించారు. మండల సమైక్య కార్యాలయంలో కిషోర్ బాలికలకు చిన్న వయసులో తీసుకున్న తప్పు నిర్ణయాల వల్ల జీవితాంతం ప్రభావంపైన, టీనేజీ ప్రెగ్నెన్సీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్. ఎంపీడీవో ఉమాదేవి. ఎస్సై రాజు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య. స్థానిక డాక్టర్ శిరీష. ఏపీఎం సుభాష్ గౌడ్. సిసిలు సుల్తానా. విజయలక్ష్మి. లక్ష్మణ్. స్వప్న. ఎమ్మెస్ అధ్యక్షురాలు రూప. ఎమ్మెస్ ఏ గీత. ఎం సి ఓ గంగాధర్. అంగన్వాడి టీచర్లు. వివో ఏలు. తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేయాలి

-డిఆర్డీఎ పిడి శ్రీనివాసరావు

బాల్యవివాహాలను నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలలభద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మానవహారం చేపట్టి బాల్య వివాహం బతుకు ఆగం వంటి నినాదాలుచేశారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఆ తర్వాత నర్సాపూర్ రైతువేదికనందు బాలలభద్రత కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజుయాదవ్, సిఐ జాన్‌రెడ్డి, ఎంపీడీవో మహమ్మద్ మొజాం హుస్సేన్, ఎస్సై రంజిత్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రఘువరన్, ఎంఈఓ తారాసింగ్, ఏపిఎం సంగమేశ్వర్, కౌన్సిలర్లు, సూపర్వైజర్లు శివకుమారి, సంతోషిమాత, మెహత, మెప్మాసిబ్బంది, డ్వాక్రాగ్రూపు సీసీలు, కిశోర బాలికలు, ఆశావర్కర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభిందిస్తున్న కళాశాల సిబ్బంది తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలలో నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా గల 16 విభాగాలలోని 149 డిగ్రీ కళాశాలల నుండి మొత్తం 1431 పరిశోధనా ప్రాజెక్టులు సమర్పించబడ్డాయి. ఈ ప్రాజెక్టులను విషయ నిపుణులు సమగ్రంగా పరిశీలించి, అందులో అత్యుత్తమంగా నిలిచిన 309 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికచేయడం జరిగింది. ఈ పోటీలలో నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక అయ్యాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.ఆదెప్ప, జిజ్ఞాస కోఆర్డినేటర్ డా.రమేష్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల్లో పాల్గొన్న విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఆరిఫ్, హేమంత్, రాజు, రాము, మహేందర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిపందుల వేటగాళ్లపై కేసు నమోదు

-వేటగాళ్లపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద నలుగురిపై కేసు

నర్సాపూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
అటవీ ప్రాంతంలో అడవిపందులను వేటాడిన నలుగురు వేటగాళ్లపై కేసు నమోదుచేసిన ఉదంతం నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నర్సాపూర్ ఫారెస్ట్ కార్యాలయంలో ఫారెస్ట్‌రేంజ్ అధికారిణి దివ్య విలేకరులకు వెల్లడించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ పట్టణం నిజాంపేట్‌కు చెందిన సురేష్, విగ్నేష్, ప్రవీణ్ అనే వ్యక్తులు శివంపేట్ మండలం గోమారంకు చెందిన సహదేవతో కలిసి శివంపేట మండలం నవాబ్‌పేట్ అటవీశివారులో మూడు అడవిపందులను వేటాడటం జరిగిందని తెలిపారు. వేటగాళ్లు అల్లిన ఉచ్చులో మూడుపందులు పడగా, అందులో ఒక అడవి పంది మృతిచెందిందన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు తమ ఫారెస్ట్ అధికారులు దాడులుచేయగా మూడు అడవిపందులను స్వాధీనపరచుకోగా అందులో ఒకటి మృతిచెందగా మరో రెండు పందులను అడవిలోకి వదిలిపెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా వేటగాళ్ల వద్ద నుండి ఆటోను, ఉచ్చులను స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. పందులను వేటాడినందుకుగాను వన్యప్రాణి సంరక్షణ చట్టం క్రింద నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని రేంజ్ అధికారిణి దివ్య తెలిపారు. ఈదాడుల్లో శివంపేట సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్‌కుమార్, బీట్ అధికారులు శ్రీవల్లి, వెంకటేష్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

-మంత్రికి వినతిచేసిన బిజెపి నాయకులు

ఎంపి రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం ఇస్తున్న లింగంగౌడ్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
గ్రామంలో మురికికాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బిజెపి నాయకులు గుడికాడి లింగంగౌడ్ ఎంపి రఘునందన్‌రావును మంగళవారం కోరారు. మండలపరిధి మడూర్‌లో మురికికాల్వల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మెదక్ ఎంపిని కోరినట్లు తెలిపారు. మురికి కాల్వల నిర్మాణానికి అయ్యే ఖర్చుల వివరాలను రఘునందన్‌రావుకు అందించినట్లు తెలిపారు. నిధుల మంజూరుకు ఎంపి రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించినట్లు లింగంగౌడ్ తెలిపారు.

బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : ఏసిపి సంజయ్

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సంజయ్.

బేగంపేట ఏప్రిల్ 28,ప్రభాతవార్త
బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో, మత సామరస్యంతో జరుపుకోవాలని సైఫాబాద్ ఏసీపీ సంజయ్ పిలుపు నిచ్చారు. మంగళవారం లేక్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎంఎస్ మక్తా కమ్యూనిటీ హాలులో ముస్లీం మత పెద్దలు, మసీద్ కమిటీ సభ్యులు, కసాయిల ప్రతినిధులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సంజయ్ మాట్లాడుతూ పండుగవేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా జంతువుల వధ, వ్యర్థాల తొలగింపు విషయంలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించా రు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో లేక్ పోలీస్‌స్టేషన్ ఎస్ హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సైఫాబాద్ ఎస్‌హెచ్‌ఓ సీతయ్య లేక్ డిఐ శ్రీనివాసరావు, ఎస్సైలు బాలరాజు, ప్రసన్న, సైఫాబాద్ ఎస్సై నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మారథాన్ 'చారిటీ బిబ్స్' షురూ

హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:
నగరంలో అత్యంత వైభవంగా జరిగే మారథాన్ 15వ ఎడిష న్‌కు సంబంధించి చారిటీ బిబ్స్ కార్యక్రమాన్ని హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ అధికారికంగా ప్రారంభించింది. మంగళవారం ఎఫ్‌టీసీసీఐలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ మారథాన్ రన్నర్, జాతీయ రికార్డు విజేత సావన్ బార్వాల్ ఈ బిబ్స్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పరుగుతో సామాజిక మార్పు అని ఈ మార థాన్ కేవలం శారీరక దృఢత్వంకోసమే కాకుండా, సమాజంలో మార్పు తీసుకురావడానికి ఒక వేదికగా నిలుస్తోందన్నారు. ఈసంవత్సరం ఇప్పటికే 35 స్వచ్ఛంద సంస్థలు ఈ మారథాన్‌తో చేతులు కలిపాయని వీటి ద్వారా విద్య, వైద్యం, పర్యావరణం వంటి వివిధ రంగాల్లో సేవలందించేందుకు నిధుల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

ఏఐ ఆధారిత పరిశోధనపై జాతీయ సదస్సు

చిక్కడపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీలో ఏఐ ఆధారిత పరిశోధన విధానం, మేనేజ్‌మెంట్, సామాజికశాస్త్రం ఫంక్షనల్ అనువర్తనాలు అనే అంశంపై జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించగా, సుమారు 40 పరిశోధనాపత్రాలు అందాయి. వీటిలో 25మంది పరిశోధకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల ద్వారా తమ పరిశోధనలను సమర్పించారు. సదస్సు ప్రిన్సిపల్ డా. బి. అంజన్ కుమార్ అధ్యక్షత వహించగా, డైరెక్టర్లు డా. జి. యాదగిరి, డాక్టర్ శాస్త్రి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మహాత్మాగాంధీ యూనివర్సిటీకి చెందిన డా.జె.సురేష్‌రెడ్డి పాల్గొని, పరిశోధన రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరుగుతున్న ప్రాధాన్యతను విశదీకరించారు. ప్యానెల్ సభ్యులుగా డా.శాంతిశ్రీ, ప్రొఫెసర్ అప్పలయ్య మీసాల, డా.జె.సురేష్‌రెడ్డి పాల్గొని పరిశోధనలపై విలువైన సూచనలు అందించారు. టెక్నికల్ సెషన్లు రెండుదశల్లో నిర్వహించబడగా, పరిశోధకులు తమ సృజనాత్మక ఆలోచనలు, పరిశోధన ఫలితాలను సమర్థవంతంగా ప్రదర్శించారు. ఈ సెషన్లు జ్ఞానమార్పిడి వేదికగా నిలిచాయి.

హైదరాబాద్ పార్లమెంట్ బిఎస్పీ ఇంఛార్జిగా రామ్‌చరణ్‌దాస్

చార్మినార్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :
పాతబస్తీకి చెందిన మూల రామ్‌చరణ్‌దాస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఎస్పీ ఇంఛార్జిగా నియమితులయ్యారు. బిఎస్పీ తెలంగాణ రాష్ట్రఅధ్యక్షులు ఇబ్రహిం శేఖర్, ఉపాధ్యక్షులు శ్రీరామ్ కృష్ణలు మంగళవారం జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఎస్పీ ఇంఛార్జిగా నియమితులైన రామ్‌చరణ్‌దాస్‌కు నియామకపత్రం అందజేశారు. రామ్‌చరణ్‌దాస్ చార్మినార్‌నియోజకవర్గం బిఎస్పీ అధ్యక్షులుగా, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా, కోశాధికారిగా పార్టీ బలోపేతంకోసం పనిచేశారు.

రామాలయంలో శ్రీ నరసింహ ఇష్టి, పూర్ణాహుతి కార్యక్రమాలు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త
కూకట్‌పల్లి రామాలయం వద్ద శ్రీ గరుడ, హనుమ మూర్తి స్థాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామాల యంలో శాంతి పాఠం, మూలమంత్ర హవనాలు, శ్రీ నరసింహ ఇష్టి, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శ్రీ గరుడ, హనుమ మూ ర్తుల స్థాపన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా రామాలయం లో ప్రతిరోజు నిత్య హోమాలు, వివిధ రకాల కైంకర్యాలు స్వామివారికి జరుగుతున్నాయని ఈ సందర్భంగా 29వ తేదీన ప్రజలందరూ కూడా గరుడ, హనుమ మూర్తులకు స్వయంగా క్షీరాభిషేకం చేసుకునే భాగ్యం కలుగుతుందని ప్రజలందరూ కూడా ఇంతటి మహత్తర కార్యక్రమంలో పాల్గొని సీతారామచంద్రస్వామి వార్ల ఆశీస్సులు పొందగలరని ఆకాంక్షించారు.

ఖైరతాబాద్‌లో కొత్త నియామకాలు

- మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం

నియామక పత్రాలు అందుకున్న దృశ్యం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
ఖైరతాబాద్ నియోజకవర్గంలో రాజకీయ చురుకుదనం నెలకొంది. కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి ఆధ్వర్యం లో మంగళవారం కొత్తగా ఏర్పడిన డివిజన్లకు నాయకత్వ నియామకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్ ప్రెసిడెంట్లు, బ్లాక్ ప్రెసిడెంట్లు, జిల్లా సెక్రటరీలను అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా బి.లావణ్య, మేరీలను జిల్లా సెక్రటరీలుగా నియమించగా, కె.శ్రీదేవిని బ్లాక్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే జి.మాధవిని సోమాజిగూడ డివిజన్ ప్రెసిడెంట్‌గా, పి.భవానిగౌడ్‌ను జుబ్లీహిల్స్ డివిజన్ ప్రెసిడెం ట్‌గా, ఎల్లమ్మను ఎర్రమంజిల్ డివిజన్ ప్రెసిడెంట్‌గా నియమిం చారు. నియామక పత్రాలను ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు నాయకత్వంలో మరింత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

మంగ్లీపై యూట్యూబ్ ఛానల్స్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి

సమావేశంలో మాట్లాడుతున్న మేఘ్‌రాజ్

సైఫాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: కొని న్న యూట్యూబ్ ఛానల్స్ ప్రముఖ గాయని మంగ్లీని టార్గెట్ చేసి అసభ్యకర పోస్టులు పెడు తూ తనని అభాసుపాలు చేస్తున్నాయని, దీనిని తీవ్రంగా ఖండి స్తున్నామని మంగ్లీ వ్యక్తిగత మేనేజర్ మేఘ్‌రాజ్ చెప్పారు.. మంగ్లీపై కొంత మంది వ్యక్తులు, యూట్యూబ్ ఛానల్స్ కావాలని తమపై బురద చల్లుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగ్లీతోపాటు ఆమె కుటుంబాన్ని ఇందులోకి లాగి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆమె పలు సందర్భాల్లో బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంగ్లీపై ఆరోపణలు గుప్పించిన వ్యక్తులు ఇప్పుడు ఎక్కడున్నారని, కావాలనే ఆమెపైన గ్లోబల్ ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. మంగ్లీ ఎక్కడ ఎండర్స్మెంట్ చేయలేదని త్వరలో నిజాలు బహిర్గతమవుతాయని స్పష్టం చేశారు. అసలు ఈ కేసులో మంగ్లీ ప్రమేయం ఉందా? లేదా? అనేదానిపైన విచారణ కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో నవీన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్య తరగతి కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు షాదిముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తుందని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్‌యాదవ్ అన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ మహ్మూద్ ఫంక్షన్ హాల్‌లో మొత్తం రూ.3 కోట్ల 25 లక్షల 37 వేల 700 విలువగల 325 మంది లబ్దిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సీఎన్‌రెడ్డి, సంగీతా శ్రీనివాస్ యాదవ్, భవానీ శంకర్, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా సాగిన హరికథాగానం

హరికథ భాగవతార్ చిరంజీవాచార్యను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 28 (ప్రభాతవార్త) : త్యాగరాయ గానసభ లోని కళాలలిత కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో తెలంగాణ హరికథా కళాకారులు అభినందన లతో ప్రతి నెల నిర్వహించే హరి కథ గానం మంగళవారం ప్రారంభం అయ్యాయి. నిజామా బాద్‌కు చెందిన ప్రముఖ హరికథా భాగవతాం చిరంజీవా చార్యచే ద్రౌపది స్వయం వరం హరికథ గానం చేశారు. రాయప్రోలు సుధాకర్ మృదంగం పై సుబ్రహ్మణ్యం వాయు లీనం పై సహకారం అందించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి కళా కారులను సత్కరించి మాట్లాడారు ప్రతి నెలా 20 వ తేదీన ప్రముఖ హరి కథకులు చే హరి కథా గానం ఏర్పాటు చేస్తున్నాము అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న (అమృతోత్స వం) శుభ సందర్భాన్ని పురస్కరిం చుకుని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు గానసభ అధ్యక్షు డు కళా వి .ఎస్ జనార్ధన మూర్తి వివరించారు.

చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాది

-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యారెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యారెడ్డి

చిక్కడపల్లి ఏప్రిల్ 28 (ప్రభాతవార్త) :
చిన్నారులకు తొలి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారి ని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ వీవీ గిరి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు.
ఈకార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ రామ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, వివస్టి రాజు, దామోదర్, సత్తిరెడ్డి, ప్రకాష్ యాదవ్, సాయి కుమార్, సంయుక్త రాణి, సాయి కృష్ణ యాదవ్, సాయి గౌడ్, అంగన్వాడీ టీచర్ ప్రమీల, అయాలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారికి 1.35 కిలోల వెండి కవచం

కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

చిక్కడపల్లి ఏప్రిల్ 28 (ప్రభాతవార్త) : జవహర్‌నగర్ టీఆర్టీలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారికి 1.35 కిలోల వెండి కవచాన్ని దాత లక్ష్మారెడ్డి మంగళవారం సమర్పించారు. ముఖ్య అతిధిగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ఆలయా నికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీవారు వినయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఆనంద్ రావు, సాయి కుమార్, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, స్థానిక ప్రముఖు లు శ్రీనివాస్ యాదవ్, కార్యక్రమ నిర్వాహకులు ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్ రావు, సంజీవ రావు, హరిందర్ రెడ్డి, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై దృష్టి: కెటిఆర్

కంటోన్మెంట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:
హైదరాబాద్‌జిల్లా పార్టీప్రజాప్రతినిధులతో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈసమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు ముటా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శ్రీమతి వాణి దేవి, శ్రీ.జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాజీ ఉపాధ్యక్షుల, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ మాజీసభ్యులు లోకనాథం, శ్రీ.పాండుయాదవ్, అనిత ప్రభాకర్, నళినికిరణ్, ప్రధానంగా ఎన్నికలసంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. దీనిని పార్టీ శ్రేణులు పకడ్బందీ కార్యాచరణతో ముందుకు తీసుకువెళ్లాలని కేటీఆర్ దిశానిర్దేశంచేశారు.

రామాయంపేటలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్..

-బిఆర్‌ఎస్‌లో ముదిరాజ్‌సంఘం నాయకుల భారీ చేరిక
-హరీష్‌రావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న 50మంది నాయకులు

హరీష్‌రావు సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరిన ముదిరాజ్ సంఘం నాయకులు

రామాయంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పట్టణ ముదిరాజ్ సంఘం ముఖ్యనాయకులతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీష్‌రావు నివాసంలో, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నేతృత్వంలో ఈచేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహంకాళి టెంపుల్ డైరెక్టర్, మాజీ వార్డుసభ్యుడు, రామాయంపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుడాల లింగం, సంఘం సలహాదారులు రెడ్డమైన నరేష్, నాయకులు పోచమ్మల కిషన్, దేవుని సర్వయ్య, రొయ్యల కిషన్‌తోసహా సుమారు 50మంది ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు బిఆర్‌ఎస్ పార్టీలో చేరి గులాబీ కండువా కప్పుకున్నారు. హరీష్‌రావు వారికి పార్టీకండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ కోసం కష్టపడేవారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలోచేరిన నాయకులు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ సిద్ధాంతాలు తమను ఆకర్షించాయని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్టి యాదగిరి, నాయకులు చౌదరి సుప్రభాతారావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాధవి, కొక్కు ప్రవీణ్, నాయకులు ఉమామహేశ్వర్, ఎస్.కె.అహ్మద్, హాస్నొదీన్, దోమకొండ శ్రీనివాస్, రొయ్యల నవీన్, మద్దెల రమేష్, పుట్టి స్వామి, పోచమ్మల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

శివారువెంకటాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

-సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల కనకయ్య

మర్కుక్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొంది రైతులు లబ్ధిపొందాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల కనకయ్యముదిరాజ్, సర్పంచ్‌లు కవిత రాంమోహన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్, శివారు వెంకటాపూర్, ఎర్రవల్లి గ్రామాల్లో ఐకెపి ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అశోక్‌కుమార్, ఆర్ఐ బాలయ్య, ఏపిఎం యాదగిరి, ఏఓ రాము, సిసిలు విజయ, కవిత, వివోఏలు దివ్య, బాలమణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి : తహసీల్దార్

శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు

మర్కుక్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు రెండో రోజు జనగణన ప్రక్రియపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి, కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలన్నారు. జనగణనలో సేకరించే సమాచారం, ప్రభుత్వ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలయ్య, జిపివోలు, ఉపాధ్యాయులు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : కనకయ్య

వడ్ల జల్లి మిషన్‌ను ప్రారంభిస్తున్న ఏఎంసి చైర్మన్ కనకయ్య

రాయపోల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో నూతన వడ్ల జల్లి మిషన్‌ను సర్పంచ్ పర్వీజ్ హైమద్, ఏపిఎం యాదగిరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మంతూరు గ్రామానికి నూతన జల్లి మిషన్‌ను అందజేయడం జరిగిందని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తొగుట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి మల్లయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లిస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి జల్లి పట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మోహన్, విస్తరణ అధికారి రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆగమ పాఠశాల విద్యార్థుల వార్షిక పరీక్షలు

కొమురవెల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వార్షిక పరీక్షలు తెలంగాణ దేవాదాయ శాఖ ఆగమ సలహా మండలి సభ్యులు డాక్టర్ మహంతయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహించారు. ఆగమ పాఠశాల విద్యార్థులకు ఈనెల 29 నుంచి జూన్ 10 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం పాఠశాల తిరిగి యథావిధిగా ప్రారంభించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సుదర్శన్, బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

స్వీయ జనగణన అందరూ సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 28,ప్రభాతవార్త

జన గణన ప్రక్రియలో భాగంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో స్వీయ నమోదు చేసుకున్నారు. జనగణనలో ఎవరికి వారు వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ పాండు, సెన్సెస్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, సిపిఓతో కలిసి కలెక్టర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రజలు వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్‌లో కానీ, మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. స్వీయ గణన ఈ నెల 26 నుంచి ప్రారంభమైందని, మే 10వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వంచే నియమించబడిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ప్రస్తుతం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ నమోదు చేసుకుంటే, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి ద్వారా ఎన్యూమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారని చెప్పారు.దీనివల్ల ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండేవారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలు జన గణనలో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేయాలని, వీటి ఆధారంగానే ఎన్యూమరేటర్లను నియమించడం జరుగుతుందన్నారు. జన గణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జనగణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయగణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తూ, సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఎంతగానో దోహదపడే జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.డిజిటల్ స్వీయ గణన గురించి ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను చైతన్య పరచాలని కలెక్టర్ కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

బెజ్జంకి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని బెజ్జంకి-బేగంపేట రహదారి అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లుగా పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో రహదారి దుస్థితి అధ్వనంగా మారింది. మంగళవారం సీపీఐ కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని గంటల తరబడి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.వర్షాకాలంలో గుంతలు నీటితో నిండిపోవడం, వేసవికాలంలో దుమ్ము సమస్యతో ప్రయాణీకులు ఇబ్బందులుపడుతున్నారు. రహదారి పనులు అసంపూర్తిగా నిలచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి ప్రారంభించిన పనులు సగం దశలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదని సీపీఐ కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి తెలిపారు. ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పట్టించుకొని అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి పనులు పూర్తి చేయించాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదు : తహసీల్దార్

వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

అక్కన్నపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం సేవాలాల్ మహారాజ్ తండాకు చెందిన రైతులు గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపుకు గురైన భూములకు పట్టాలు మంజూరు చేసి, ఐకేపీ సెంటర్‌లో ఆన్‌లైన్ నమోదు చేసి వడ్ల కొనుగోలు చేపట్టాలని సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఆర్డీఓ ఆదేశాల ప్రకారం మంగళవారం అక్కన్నపేట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ గౌరవెల్లి ప్రాజెక్టుపరిధిలో ముంపుకు గురైన భూములను పరిశీలించారు. రైతుల వద్ద ఉన్న పట్టాలు, భూమి విస్తీర్ణం, ఎంత మేరకు భూమి కోల్పోయారనే వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని 99 శాతం భూములను ప్రభుత్వ భూమి సీలింగ్ భూమి సాదాబయాన ద్వారా తీసుకున్నారు. అవి ప్రభుత్వ భూములని, కొత్తగా పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని, అందు వల్ల ఆన్‌లైన్‌లో నమోదు చేయలేమని పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తి నివేదికను ఆర్డీఓతో పాటు జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు.

బిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

-ఎంపిటిసిల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్

మర్కుక్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): బిఆర్ఎస్ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంపిటిసిల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. మంగళవారం దామరకుంట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త లింగ పెంటయ్య అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతిచెందగా అతడి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, మాజీ ఎంపిటిసి నర్సింలు, వార్డు సభ్యులు రేణుకశ్రీనివాస్, శ్రీలతగోపి, నాయకులు పత్తి రమేష్, మారబోయిన మల్లేష్, రాజబోయిన మహేష్, గడ్డం రాంచంద్రం, వనం సంతోష్, వెంకటేష్, చీరబోయిన వెంకటేష్, బక్కల రాజు, మాదరి రాజు, సత్తయ్య, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు

పోచమ్మ ఆలయానికి పునర్నిర్మాణం ప్రారంభిస్తున్న దృశ్యం

ఆలయ పునర్ నిర్మాణానికి పూజలు

గుమ్మడిదల ఏప్రిల్ 28 ప్రభాతవార్త : అంబేద్కర్ కాలనీలో శిథిలావస్థలో ఉన్న పోచమ్మ దేవాలయానికి కొత్త జీవం పోసే దిశగా పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. పురోహితుడు శంకర్‌శర్మ వేద మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శుభారంభం కల్పించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన సుమారు రూ.10 లక్షల వ్యయాన్ని తానే భరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేవాలయ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, మే 4న మాధవానంద సరస్వతిస్వామి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్, కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, చక్రపాణి, సర్పంచ్ కొమ్ము శ్రీను, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, సత్యనారాయణ మహేష్, దర్గా శీను, ఆంజనేయులు, గోపాల్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తుడుం రవి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్త'

మునిపల్లి, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో 99 రోజుల పాటు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జరిగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ ఎం.సుధాకర్‌రెడ్డి, రైతులకు పంటల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న డిఏఓ శివ ప్రసాద్, రమాదేవి శాస్త్రవేత్త, ఇబ్రహీంపూర్ గ్రామ సర్పంచ్ ల్యాగాల అశోక్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, రైతులు మరియు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

తహసీల్దార్ మాలతి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28,ప్రభాతవార్త: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ మాలతి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలో కిశోర బాలికలకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ బాల్య వివాహ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడిపిల్ల వయస్సు 18 సంవత్సరాలు నిండకముందే వివాహం జరిపిస్తే మానసిక, శారీరక అనర్థాలు సంభవిస్తాయన్నారు. బాల్య వివాహాల వలన జరిగే నష్టాల గురించి వారికి వివరించారు. పోషక పదార్థాలను తిసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. అనంతరం బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో బాల్య వివాహలు జరుగుతున్నాయని తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, వైద్య సిబ్బంది యాదగిరి, ఏపీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గుండె పోటుతో ఉపాధి కూలీ మృతి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:

ఉపాధి కూలీ పనులు చేస్తూ ఒక వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దిరాములు(55), జయమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం సిద్దిరాములు ఎప్పటిలాగే ఉపాధి హామీ పనులకు వెళ్లాడు.పనిచేస్తుండగా ఉన్నట్టుండి చాతీలో నొప్పి వస్తుందని తోటి కూలీలకు తెలపడంతో వారు హుటాహుటిన నార్సింగీలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సిద్దిరాములును పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై టిఎ సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాంపల్లి, ఫిల్డ్ అసిస్టెంట్ రామక్రిష్ణారెడ్డిలు ఉన్నతాధికారులకు సమాచారం అందినట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చిన సిఎం రేవంత్‌రెడ్డి

డిసిసి అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి

సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆంక్షరెడ్డి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు

గజ్వేల్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని జిపిపి డిపో వద్ద కార్మికులు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆందోళన చేసిన ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరగగా, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, జూన్ 2వ తేదీన విలీన ప్రకటన చేస్తామని ప్రకటించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు గుర్తుచేశారు. అంతేకాకుండా ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలకు అంగీకారం తెలపడంతో పాటు 10 శాతం ఫిట్మెంట్ ఇవ్వడానికి సన్నద్ధత ప్రకటించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికుల 31 డిమాండ్లలో 28 డిమాండ్లకు ఏకకాలంలో పరిష్కారం లభించగా, కార్మికుల కుటుంబాల నుండి సంతోషం వ్యక్తమవుతోందని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెద్దిరెడ్డి అశోక్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షరీఫ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, నాయకులు జహీర్, గుంటుకు శ్రీనివాస్, విఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సారిక శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, యాదగిరి, మహేష్ యాదవ్, అశోక్, కుమార్, కరుణాకర్‌రెడ్డి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

మల్లికార్జున స్వామి దేవాలయంలో దుకాణాలకు వేలం

కొమురవెల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో మంగళవారం ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సీల్డ్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. బుకింగ్ కార్యాలయం వద్ద పూజ సామాగ్రి విక్రయించుకునే షాపు నంబరు-1, టీటీడీ వద్ద షాపు నంబరు 15, అన్నదానం వద్ద షాపు నంబరు 4కు వేలం నిర్వహించారు. వేలం పాటలో పాల్గొన్న పలువురు హెచ్చుపాట పాడి షాపులను దక్కించుకున్నారని ఆలయ ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు బుద్ధి శ్రీనివాస్, రావుల సుదర్శన్, సూపరింటెండెంట్ నీల శేఖర్, కంప్యూటర్ శ్రీనివాస్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

మర్కుక్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు మంగళవారం మండలకేంద్రమైన మర్కుక్ రైదువేదికలో సిద్దిపేట తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిద్దిపేట తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.పల్లవి, డాక్టర్ జి.నీలిమ, మండల వ్యవసాయాధికారి రాము మాట్లాడుతూ వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని, రసాయనాలను అవసరం మేరకు వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంట మార్పిడి పాటించడం ద్వారా స్థిర ఆదాయం పొందవచ్చని, మార్కెట్‌లో లాభసాటిగా ఉన్న వరి రకాలను పండించడం, వివిధ పంటలలో సాగునీటిని ఆదా చేసే అవసరమైన పరిజ్ఞానాన్ని, ప్రత్యామ్నాయ పంటల వివరాలను, సేంద్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు సాయి ప్రసన్న, భానుశ్రీ, విష్ణువర్ధన్, క్రాంతికుమార్‌తో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతు చేయాలి

-టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని చెత్త సేకరణ వాహనాలు కొన్ని నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వెంటనే మరమ్మతుచేసి వాడుకలోకి తీసుకురావాలని టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి కోరారు. మంగళవారం నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనాలను కొంత మంది కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయిని యాదగిరి మాట్లాడుతూ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలు కొన్ని చిన్న చిన్న మరమ్మతులు చేయాల్సి వుండగా, వాటిని మరమ్మతు చేపించకుండా నిరుపయోగంగా వదిలేశారని అన్నారు. మున్సిపాలిటీలో అవసరంలేని ఖర్చులు చేస్తూ నిత్యం అవసరమున్న వాటిని పక్కన పెట్టడం ఏమిటని, మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కామిని మురళి, రొట్టెల శ్రీనివాస్, నాయకులు మన్నె వెంకటేశం, నక్క రాములుగౌడ్, గుంటుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవ వధువుల వివాహానికి ఆర్థిక సహాయం అందజేత

కొమురవెల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని గురువన్నపేట గ్రామానికి చెందిన నవ వధువుల వివాహనిమిత్తం మంగళవారం బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే జీవితంలో నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. కష్టాలలో ఉన్న వారికి మానవత్వంతో తన వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో మజ్జిగ పంపిణీ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : జిల్లా అలియన్స్ గవర్నర్ సోమ శివకుమార్ ఆధ్వర్యంలో వేసవికాలం దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చడానికి మంగళవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లార్వెన్ స్కూల్ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేశారు.వేసవి కాలం ముగిసే వరకు బాటసారుల దాహార్తిని తీర్చడానికి ప్రతి నిత్యం మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో అలియన్స్ ప్రతినిధులు సుజాతప్రసాద్, వనజ, ధనుంజయ, స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ట్రాఫిక్ సిఐ

మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ మురళి

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త : గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్కు వద్ద మంగళవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రోడ్డు మీద వాహనాలు నడిపే వాహనదారులకు, పరిసర ప్రాంతాల షాపు యజమానులకు, ఆటో డ్రైవర్లకు మోటార్ వెహికల్ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం నేరమన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మైనరులు వాహనం నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయొద్దన్నారు. బాటసారులు రోడ్డు దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్ వద్దనే దాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, హెచ్‌సి సాంబశివరావు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంసాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్చారం, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని అంసాన్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ ఆంజనేయులు సూచించారు. కొల్చారం మండల పరిధిలోని అంసాన్‌పల్లి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సీఈఓ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ గల్వా ఇంద్రసేనారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ మన్నే రాములుతో కలిసి ప్రారంభించారు. ముందుగా తూకానికి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని తూకం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు నేరుగా కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2369 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పుచ్చయ్య, వెంకట్ గౌడ్, నర్సాగౌడ్, రమేష్, రామన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సీఈఓ ఆంజనేయులు

వైభవంగా రంగనాయక స్వామి కళ్యాణోత్సవం

కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొల్చారం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ భూనీలాసమేత రంగనాయకస్వామి పంచాహ్నిక కళ్యాణ, రథోత్సవ వేడుకలు గత మూడురోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం మూడవరోజు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రంగనాయక స్వామి, లక్ష్మీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండితులు వేదమంత్రోచ్చాటనల మధ్య కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు గోవిందనామస్మరణలతో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం భక్తులు అమ్మవారికి, స్వామివారికి ఒడిబియ్యం, మొక్కులు సమర్పించారు. తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి స్వామివారికి హనుమంత వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచి అరిగె స్వర్ణలత విజయ్‌కుమార్, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు బండి పోచయ్య, బొడ్డుల వెంకటనారాయణ, కామిని శ్రీనివాస్, ప్రభాకర్, రమేష్‌బాబు, విజయ్‌కుమార్, వీరేశం పాల్గొన్నారు.

అప్పాజీపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

కొల్చారం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో కొల్చారం పిఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచి నాయిని వెంకట్‌గౌడ్(గజిని) ప్రారంభించారు. ముందుగా తూకానికి కొబ్బరి కాయ కొట్టి, అనంతరం ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని నేరుగా ధాన్యం విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెలం నర్సింలు, వార్డు సభ్యులు సదాల నర్సింలు, మానేపల్లి సావిత్రి, కదూరి సుశీల, రామాంజం, పంచాయతీ కార్యదర్శి పణింద్ర కృష్ణ, సీఈఓ పార్టిగారి కృష్ణ, కదూరి కుమార్, తిమ్మాకాపల్లి ప్రభాకర్, తిమ్మాకాపల్లి సుధాకర్, శంకర్‌గౌడ్, శ్రీకాంత్ గోడి, సురేష్, రెడ్డి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కచ్చితత్వం అవసరం

-ఎన్యూమరేటర్లతో తహసీల్దార్ శ్రీనివాస్

ఎన్యూమరేటర్లకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మొగుడంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

దేశాభివృద్ధిలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న జనగణన2027 శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ఎన్యూమరేటర్లకు తహసీల్దార్ శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లు సేకరించే వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు. ఎన్యూమరేటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధికారులు ఇచ్చిన సూచనలతో అధిగమించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

షీ-టీంపై విద్యార్థులకు అవగాహన

ఝరాసంగం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన ఝరాసంగంలోని పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం ఆవరణలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే 1098కు కాల్ చేయాలని, షీటీంవారు రంగంలోకి దిగి బాధితులకు అండగా ఉంటారన్నారు. ఇతరులతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రతించాలని వివరించారు. పోక్సో, పోష్ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వీడియో గేమ్స్ ఆడుతున్నప్పుడు అపరిచితులు పంపించే లింకులపై క్లిక్ చేయవద్దని వివరించారు. అవగాహన కార్యక్రమంలో పాఠశాలలో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు విద్యాలయ ఇంచార్జి ప్రిన్సిపాల్ వి.శోభన్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లమ్మతల్లి జాతరలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

నర్సాపూర్ మండలం మూసాపేట్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన శ్రీరేణుకఎల్లమ్మతల్లి కళ్యాణం, జాతరలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శివంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, జిల్లా కార్యదర్శి రవీందర్, నాగులపల్లి సర్పంచి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాధాకృష్ణ, శ్రీశైలంయాదవ్, కొండి దుర్గేష్, లింగం, మెహన్‌దాస్, మల్లికార్జున్, రమేష్, శేఖర్‌గౌడ్, సాయిశరణ్‌గౌడ్, దాడిగే నరేష్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

సదాశివపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

సదాశివపేటమండలం మిల్‌గిరిపేట గ్రామంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, సంగారెడ్డిజిల్లా వ్యవసాయశాఖ సహకారంతో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రానున్న వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేయడం, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు స్వర్ణ, గ్రామసర్పంచి ఎం.షాబొద్దీన్, ఉపసర్పంచి యాదయ్య, రాజేంద్రనగర్ వ్యవసాయకళాశాల విద్యార్థి మనోజ్ పాల్గొన్నారు.

కొల్చారంలో రైతులు ముంగిట్లో శాస్త్రవేత్తలు

కొల్చారం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతులు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా కంది వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల బోధనసిబ్బంది డాక్టర్ లక్ష్మణ్‌రావు, డాక్టర్ నీమా, రంగంపేట గ్రామంలోని పిఎసిఎస్ ఆవరణలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి అరిగే స్వర్ణలత, ఉపసర్పంచి, వార్డుసభ్యులు, రైతులు, హార్టికల్చర్ శాఖ హెచ్ఈఓ కీర్తన, వెటర్నరీ డాక్టర్ ప్రియాంక, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి ఎం.శ్వేతకుమారి, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రాజ శేఖర్‌గౌడ్, వ్యవసాయ ఇంజినీరింగ్‌కళాశాల విద్యార్థులు సుల్తాన్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ప్రతిష్ఠ

-పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో మాధవానంద సరస్వతి స్వామి

పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో మాధవానంద సరస్వతి స్వామి

పాపన్నపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

పాపన్నపేట మండలపరిధిలోని నాగసానిపల్లిగ్రామంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి రెండవరోజు రావడం జరిగింది. గ్రామదేవతలు దుర్గమ్మ, పోచమ్మ దేవాలయాల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా స్వామివారు విచ్చేయడం సంతోషకరంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, భక్తులు, భక్త బృందం, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

పెద్దశంకరంపేటలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంపిడిఓ క్రాంతికుమార్, ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి, వైద్యులు వికాస్, ఎపియం శకుంతల, సర్పంచ్ జంగం రేణుకలు పేర్కొన్నారు. మంగళారం ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ ప్రెగ్నెన్సీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ జాకీరిస్సేన్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శ్రీశైల, హేమలత, సూపర్వైజర్ రమణా బాయి తదితరులున్నారు.

పోగొట్టుకున్న 11 ఫోన్లు అందజేత

పాపన్నపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

ఎక్కడైనా ఫోన్ పోగొట్టుకున్న, దొంగలించబడిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇటీవల వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న 11 సెల్ ఫోన్లు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా రికవరీ చేసినట్లు తెలిపారు. మంగళవారం ఠాణాలో వారికి ఫోన్లు అందజేశారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్ పరిధిలో 509 ఫోన్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నారాయణఖేడ్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరాతీశారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవలు, చెకప్‌లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా, లేవా అనే విషయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ప్రతి రోజు ఇన్‌పేషెంట్స్, ఔటోపేషెంట్స్ సంఖ్య, గర్భిణుల చెకప్‌లు, అందుబాటులో ఉన్న పరీక్షలు, ప్రతి నెల జరిగే ప్రసవాల సంఖ్య తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలన్నారు. ముఖ్యంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఎంపిడిఓ, మెడికల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటి హైదరాబాద్ 18వ స్థాపన దినోత్సవం

మొక్కలు నాటుతున్న ముఖ్యఅతిథి, డైరెక్టర్, ఇతర అధికారులు

సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

ఐఐటి హైదరాబాద్ 18వ స్థాపన దినోత్సవం మంగళవారం హైదరాబాద్ ఐఐటీలో నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్ మెగాసేసే అవార్డు గ్రహీత, పద్మశ్రీ ప్రకాష్‌బాబా ఆమ్టే హాజరయ్యారు. తక్కువసమయంలో ఐఐటి హైదరాబాద్ సాధించిన విజయం గురించి ప్రస్తావించారు. ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి మాట్లాడుతూ అనతికాలంలోనే ఐఐటి హైదరాబాద్ దేశంలోని విజయవంతమైన విద్యాసంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందే ప్రశంసలు అందుకోవడం గర్వకారణం అని అన్నారు. కార్యక్రమంలో ఐఐటి హైదరాబాద్ బోధనాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఐఐటి ఆవరణలో మొక్కలు నాటారు.

బాల్య వివాహాలను ఆరికట్టవచ్చు

-సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్

బాలల భద్రత వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న చంద్రం కృష్ణాగౌడ్

కౌడిపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో గ్రామీణ స్థాయి నుంచి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినప్పుడే బాల్య వివాహాలను ఆరికట్టవచ్చని సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, కౌడిపల్లి గ్రామసర్పంచ్ చంద్రం కృష్ణాగౌడ్ ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఐసిడిఎస్, వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాలలభద్రత వారోత్సవాలకు ఆయనతోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ చిలుముల సుహాసినిరెడ్డి, డిడబ్ల్యూవో హేమభార్గవి, స్థానిక ఎస్సై అమరేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ముందుగా ఆర్టీసి బస్టాండ్ వద్ద పిల్లల తల్లిదండ్రుల చేత మానవహారం నిర్వహించి, బాల్య వివాహాలను ఆరికట్టుతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీగా ఐకెపి కార్యాలయం వరకు తరలివెళ్లి డిడబ్ల్యూవో హేమభార్గవి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వీరితోపాటు ఎంపిడిఓ శ్రీనివాస్, తహసీల్దార్ క్రిష్ణయ్య, పిహెచ్‌సి మెడికల్ అధికారి, ఐకెపి ఎపిఎం సంగీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

-సిఐటియు డిమాండ్

మాట్లాడుతున్న కడారి నాగరాజు

చిలిపిచెడ్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనదికాదని సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపిచెడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వారు మాట్లాడుతూ.. గతప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడంలేదని.. కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని, నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డునపడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

బాల్యవివాహాల నివారణకు కృషిచేయాలి: ఎస్సై శంకర్

అల్లాదుర్గం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఎస్ఐ శంకర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన 99 రోజుల్లో భాగంగా చిల్డ్రన్స్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అల్లాదుర్గంలోని మండల ఐకెపికార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సమాజంలోవస్తున్న మార్పుల కారణంగా ఆడపిల్లలు వివక్షకు గురవుతున్నారని, దీనిని రూపుమాపాలంటే కుటుంబ వ్యవస్థలో మార్పులురావాలని, అమ్మాయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని అన్నిరంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలని, చిన్నవయసులో వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు జరిగే ఆస్కారం ఉందని, యుక్తవయసు వచ్చే వరకు ఆగి తల్లిదండ్రులు వివాహాలు జరిపించాలని సూచించారు. చిన్నప్పటి నుండి పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించాలని కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీవో వేద ప్రకాష్‌రెడ్డి, డాక్టర్లు సారిక, అశ్విని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పని స్థల భద్రతా ఆరోగ్య దినోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

రామచంద్రాపురంలోనీ బిహెచ్ఈఎల్‌లో మంగళవారం ప్రపంచ పనిస్థల భద్రతా, ఆరోగ్యదినోత్సవాన్ని ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, సంగారెడ్డి ఫ్యాక్టరీల తనిఖీ అధికారిణి వై.శ్రీవిద్య, సిఎం డాక్టర్ సంధ్యాకార్, యూనియన్ డిబ్యుయు అధ్యక్షులు ఎస్‌డివి కృష్ణంరాజులు ముఖ్య అతిథులుగా హాజరుకాగా కేంద్ర భద్రతాసంఘం, భద్రత ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించారు. పతాకావిష్కరణతో కార్యక్రమానికి శ్రీకారంచుట్టి ప్రార్థనాగీతం, బిహెచ్ఈఎల్ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కేంద్ర భద్రతాసంఘం సభ్యులు త్రిభాషా భద్రత, ఆరోగ్య ప్రతిజ్ఞలు చేయించారు. ప్రపంచ భద్రతా ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని నినాద రచన, పోస్టర్ రూపకల్పన, ఉత్మ భద్రతా పర్యావరణ ప్రాజెక్టు, ఆన్‌లైన్ ప్రశ్నోత్తరపోటీలు, భద్రతాపోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో ప్రధాన భద్రతా అధికారి కె.అరవింద్‌కుమార్, భద్రతా అధికారులు బి.పరశురామ్, డా.గోగు వెంకటేశ్వర్లు, టి.హరీష్‌బాబు, టి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకుంటున్న దృశ్యం

మనూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మండలకేంద్రమైనమనూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 2000-2001 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో విద్యను అందుకున్న విద్యార్థులు మంగళవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనాన్ని ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు అనంత్‌రావు, సంజీవరెడ్డి, మచెందర్, ప్రభులను కార్యక్రమానికి ఆహ్వానించి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు. 25ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకున్న విద్యార్థులు నాటి క్లాస్‌రూం జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఉత్సాహంగా రోజును గడిపారు. కార్యక్రమంలో నారాయణ, జైపాల్, బశెట్టి, కాశీనాథ్, గణపతి, బక్కన్న, మారుతి, సిద్దప్ప, రమేష్ పాల్గొన్నారు.

తునికికుంట తండాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం దృశ్యం

కంది, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయకళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలపరిధిలోని తునికికుంటతండాలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆసియాబేగం, ఎఈఓ క్రిష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ఎన్.జలజ, సర్పంచి నేనావత్ కిషన్ నాయక్, రైతులు ప్రకాష్, లక్ష్మన్, పాండు, చావాన్ రవి, ఎన్.సర్దార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిబిరాలతో పేదలకు మెరుగైన వైద్యం

-మొగుడంపల్లి సర్పంచి రాజు

మొగుడంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలతో పేదలు మెరుగైన వైద్యం అందుకునే అవకాశం ఉంటుందని మొగుడంపల్లి సర్పంచి రాజు అన్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో మంగళవారం బస్టాండ్ సమీపంలో సిటీ సెంటర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మక్సూద్‌తో కలిసి సర్పంచి రాజు ప్రారంభించారు. వైద్యశిబిరానికి చేరుకున్న 500మందికి ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించి మందులను పంపిణిచేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శివకుమార్, ఆరాధనరెడ్డి, అశోక్, ఆయా గ్రామాల సర్పంచులు, వార్డుసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ఆదర్శరెడ్డి పూజలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురంలని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని శ్రీఎల్లమ్మతల్లి ఆలయంలో ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఆలయానికి చేరుకుని ఆలయ అర్చకులు వేదమంత్రాలు పల్లిస్తుండగా ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్యకురుమ, బిఆర్ఎస్ నాయకులు పరమేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, బల్ల నర్సింగ్, చరణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట చెరువు అభివృద్ధిపై నజర్

-మినీ ట్యాంక్ బండ్ లా సుందరీకరణ
-త్వరలో ప్రజలకు అందుబాటులోకి

నల్లకుంట చెరువును పరిశీలిస్తున్న పాలకవర్గం

గుమ్మడిదల, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని దోమడుగు వార్డులో ఉన్న నల్లకుంట చెరువును, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు కలిసి పరిశీలించారు. చెరువును ప్రజలకు ఉపయోగపడేవిధంగా అభివృద్ధిచేసి ఆహ్లాదకర వాతావరణంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈసందర్భంగా పిల్లలకు ఆటపరికరాలు ఏర్పాటుచేయడం, ఉదయం కాలినడకన వెళ్లేవారికి వాకింగ్‌ట్రాక్‌తోపాటు అవసరమైన వసతులు కల్పించడం, చెరువు పరిసరాలను స్వచ్ఛంగా పచ్చదనంతో అభివృద్ధి చేయడం వంటి అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అలాగే మినీట్యాంక్‌బండ్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈసందర్భంగా చెరువుకట్ట బలోపేతం, మినీట్యాంక్‌బండ్ నిర్మాణం, వాకింగ్‌ట్రాక్, విద్యుత్ దీపాల ఏర్పాటు, పచ్చదనం అభివృద్ధి వంటి పనులపై అవసరమైన వివరాలను, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. చెరువు పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం వంటి చర్యలు చేపడతామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, అబిశెట్టి రాజశేఖర్, సురభి కుమార్‌గౌడ్, బెంబిడి సంజీవరెడ్డి, విజయలక్ష్మి, కిషన్, నాయకులు వెంకటరమణ, ఆకుల సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.